ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 8 నవంబరు 2025



విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి


అధికారుల సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏఐ ల్యాబ్ ద్వారా విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఎక్స్ఎల్ పాఠశాలల పురోగతిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎక్స్ఎల్ పాఠశాలల్లో అవసరం మేరకు అదనంగా కంప్యూటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ల్యాబ్‌లో ప్రతీ విద్యార్థి కనీసం అరగంట పాటు ఉండేలా చూడాలన్నారు. పిల్లల విద్యా ప్రమాణాల పెంపునకు వాస్తవిక రిపోర్టును అందించాలన్నారు. ల్యాబ్‌లో పిల్లలకు రెగ్యులర్‌గా ఇంగ్లీష్, తెలుగు, గణితం పాఠాలు నేర్చుకునేలా చూడాలన్నారు.

దేశ జన జాగృతి గీతం వందేమాతరం...


వందేమాతర గీతాన్ని ఆలపిస్తున్న సీపీ, పోలీసులు

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన జనజాగృతి గీతం వందేమాతరం అని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శుక్రవారం వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కమిషనరేట్‌లో గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ వందేమాతర గీతం, జాతీయ సమైక్య, ఆత్మగౌరవాన్ని పెంపొందించిందన్నారు. జాతీయోద్యమం, స్వాతంత్ర్యోదమంలో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిందన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, మల్లేషం, సూపరింటెండెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు.. 161 మందికి బంగారు పతకాలు

7

◄ ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు, ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

శాతవాహన విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఛాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 161 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసం విద్యార్థి విజయానికి దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలన్నారు. - కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

కోర్టు కేసుల ట్రాకింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

పెద్దపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల ట్రాకింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కోర్టు కేసుల ట్రాకింగ్‌పై జిల్లా అధికారులకు, తహసిల్దార్లకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. కోర్టు కేసుల ట్రాకింగ్ కోసం పోర్టల్ తయారు చేశామన్నారు. ప్రతి జిల్లా అధికారి పేరిట లాగిన్ తయారు చేసి కోర్టు కేసులు రెగ్యులర్ ఫాలో అప్ చేస్తూ ట్రాక్ చేసేందుకు వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. సోమ వారం నుంచి ఈ వ్యవస్థ పని చేయాలని, కోర్టు కేసుల సంబంధించిన సంపూర్ణ వివరాలు ఈ-పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికా రులకు సూచించారు. ఆర్డీఓలు గంగయ్య, సురేష్, జిల్లా అధికారులు, తహసిల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.

చిన్న నీటి వనరుల సర్వేకు

గ్రీన్‌సిగ్నల్



- నీటి వనరుల లభ్యత, పంటల సాగుపై ఐదేళ్లకోసారి సర్వే
- 207 రెవెన్యూ గ్రామాల పరిధిలో నిర్వహణ
- వ్యవసాయ, పంచాయతీ, రెవెన్యూ శాఖల సిబ్బంది నియామకం
- ఈ నెల మూడో వారంలో ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో చిన్న నీటి వనరుల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నీటి వనరుల లభ్యత, తద్వారా ఎంత మొత్తం విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయో సర్వే చేపడుతారు. ఆ మేరకు జిల్లాలో గల 207 రెవెన్యూ గ్రామాల పరిధిలో సర్వే నిర్వహించేందుకు ఒక్కో ఎన్యూమరేటర్‌ను నియ మించారు. 47 మంది వ్యవసాయ విస్తీర్ణాధికారులు, 107 మంది గ్రామ పంచాయతీ అధికారులు, 49 మంది పంచాయతీ కార్యదర్శులు, ముగ్గురు ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. సర్వే చేపట్టేందుకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల మూడో వారం నుంచి అన్ని గ్రామాలు, పట్టణాల్లో సర్వే నిర్వహించనున్నారు. మూడు మాసాల క్రితమే కేంద్ర ప్రభుత్వం సర్వే చేయాలని ముఖ్య ప్రణాళిక శాఖాధికారులను ఆదేశించింది. ఈ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల్లో క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బం దిని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

కానీ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంలో జాప్యం చేసింది. అప్పటి వరకు మండలాల్లో పని చేస్తున్న మండల పరిషత్ గణాంకశాఖ అధికారులు రెండు గ్రామాల్లో సర్వే చేయాలని పీవో సూచించ డంతో సర్వే మొదలు పెట్టా రు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే నీటి వనరుల లభ్యత, తద్వారా సాగ వుతున్న పంటల వివరాలను సేకరించాలని ఆదేశిం చారు. ప్రతీ ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో గల చిన్ననీటి వనరులైన చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు, ఎత్తిపోతల పథకాల్లో ఉన్న నీటి లభ్యత, సాగవుతున్న పంటల వివరాల గురించి సర్వే చేస్తారు. ఇప్పటి వరకు ఆరుసార్లు సర్వే నిర్వహించగా, ప్రస్తుతం చేపట్టనున్న సర్వే 7వసారి కావడం గమనార్హం. ఈసారి గ్రామాల్లోనే గాకుండా పట్టణాలు, వాటి పరిసరాల్లో ఉండే నీటి వనరులపై కూడా సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వే ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశ అవసరాలకు పంటల అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉందా లేదా అని పరిశీలించనున్నారు. ఈ సర్వేను అనుసరించి నీటి వనరులను పెంపొం దించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పలు పథకాలను అమల్లోకి తీసుకరానున్నారు.

ఈసారి యాప్ ద్వారా సర్వే

గ్రామాలు, పట్టణాల్లో గల చిన్న నీటివనరుల ద్వారా నీటి లభ్యత ఎంత ఉంది, వాటి కింద ఎన్ని ఎకరాల భూములకు సాగు నీరు అందుతున్నాయి. సాగు నీటి అవసరాలకే గాకుండా, తాగునీటి అవసరాలకు కూడా సద్వినియోగం అవుతున్నాయా, ఇతర త్రా అవసరాలకు సద్వినియోగం అవుతున్నాయా? తదితర అంశాలపై సర్వే చేయనున్నారు. గతంలో మ్యానువల్‌గా కాగితా లపై సర్వే చేయగా. ఈసారి యాప్ ద్వారానే సర్వే చేయనున్నారు. చిన్న నీటి వనరుల వద్దకు వెళ్లి సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ఓపెన్ చేసి వివరాలను నమోదు చేయాలి. చెరువులు, కుంటల వద్దకు వెళ్లి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియో ట్యాగింగ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మొదట 100 ఎకరాల లోపు ఆయకట్టు గల నీటి వన రులపై సర్వేచేసి, ఆ తర్వాత 100 ఎకరాలకు పైగా ఉన్న వాటి గురించి సర్వే చేయనున్నారు. 250 ఎకరాల ఆయకట్టుకు పైబడిన వాటి గురించి వేర్వేరుగా సర్వే నిర్వహించనున్నారు. ఇవేగాకుండా బిందు, తుంపర సేద్యంలో నీటిలభ్యత, నిల్వ సామర్థ్యం, విద్యుత్ వాడకం, పంటల వివరాలను సేకరించాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ

మిగతా 8వ పేజీలో...

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం


పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్

కోల్‌సిటీటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శుక్రవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఓఏ క్లబ్ సమీపంలోని బెడెన్ పావెల్ పార్క్ వద్ద జరిగిన స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవానికి సింగరేణి ఆర్‌జీ-1 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడారు. 1950లో భారత్ స్కౌట్స్‌గైడ్స్‌ను స్థాపించిన రోజును ప్రపంచ చరిత్రలో బెడెన్‌పౌల్ నూతన ఒరవడిని సృష్టించి ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థ సేవలో ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. స్కార్ఫ్‌లను ఆవిష్కరించి స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు అందజేశారు. వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక స్టిక్కర్స్‌ను పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు అందజేశారు. రోవర్ స్కౌట్ మాస్టర్స్ కె.బుచ్చయ్య, దేవేందర్, డి.కుమార్, స్వర్ణలత, లక్ష్మీకుమారి, రాజయ్య, కుమార్, సెయింట్ పాల్ పాఠశాల, సింగరేణి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అడ్డగుంటపల్లిలోని శ్రీరామవిద్యానికేతన్‌లో శుక్రవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ దినోత్సవం నిర్వహించారు. జిల్లా సెక్రటరీ ఎస్.జ్యోతి జెండాను ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కుమార్, సదానందం, రాజమౌళి, విజయ పాల్గొన్నారు.

అనుమతులకు మించి తరలించొద్దు

పెద్దపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మట్టి, బండ క్వారీల్లో అనుమతులకన్నా ఎక్కువ తరలించొద్దని జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తుర్కలమద్దికుంటలో మట్టి క్వారీ, బొంపల్లిలోని బండ క్వారీలను తనిఖీ చేశారు. ఎంత మోతాదులో తరలించారనే విషయంపై ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా సర్వే నిర్వహించినట్లు మైనింగ్ ఏడి శ్రీనివాస్ అన్నారు. రిపోర్ట్ రావడానికి కొన్ని రోజులు పడుతుందని దాని ద్వారా అనుమతులకు మించి తరలించిన వారికి నోటీసులు అందించడంతోపాటు రికవరీ చేస్తామన్నారు. ఆర్ఐ వెంకటగిరి, సర్వేయర్ వీర భద్రరావు, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటరెడ్డి ఉన్నారు.

దారి మైసమ్మ గుడుల కూల్చివేతపై నిరసన


కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో దారి మైసమ్మల గుడులను కూల్చి వేయడంపై హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఖని చౌరస్తాలోని పోచమ్మ గుడి వద్ద సమావేశమై చర్చించారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని నిరసన కార్యక్రమానికి కార్యాచరణ ప్రకటించారు. హిందు ఐక్యవేదిక నాయకులు కొండపర్తి సంజీవ్, కోమళ్ల మహేష్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రావాలని నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ రహదారికి అడ్డుగా ఉన్న నిర్మాణాలను కూల్చివేసే సమయంలో ఆలయాలకు చెందిన బాధ్యులతో చర్చించాలని సుప్రీంకోర్టు పేర్కొందని, రోడ్డుకు అడ్డుగా ఉందంటూ కార్పొరేషన్ అధికారులు రాత్రికి రాత్రి కూల్చివేశారని ఆరోపించారు. దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. కలెక్టర్ స్పందించడం లేదంటూ రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఏసీపీ రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డిలు ఆందోళనకారులతో మాట్లాడారు. ఏసీపీ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. కలెక్టర్ ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తామని కలెక్టర్ హామీతో వారు ఆందోళన విరమించారు. అనంతరం పెద్దపల్లికి వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయ కులు కందుల సంధ్యా రాణి, కౌశిక హరి, మేరుగు హన్మంతుగౌడ్, రాం మూర్తిగౌడ్, రాసమల్ల జనార్దన్, సింహాచలం రత్నాకర్, వాసర్ల జోసఫ్, బొబ్బిలి సతీష్, అంబటి నరేష్, వడ్లకొండ రవీందర్, ఎంచర్ల మహేష్, పొన్నం శశి, బొబ్బిలి సతీష్, దొమ్మేటి వాసు, పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహంతోనే కూల్చివేతలు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రామగుండంలో అధికారులు అత్యుత్సాహంతో రోడ్ల పక్కన ఉన్న నిర్మాణాలను కూలగొట్టారని, దీనికి అధికార యంత్రాంగానిదే బాధ్యతని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నాయకులు మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, రామాలయ కమిటీ చైర్మన్ గట్ల రమేష్ మాట్లాడారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సొంత డబ్బులతో గుళ్ల నిర్మించిన చరిత్ర ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఏ మతానికి చెందిన మనోభావాలను కించపరిచే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదన్నారు. ఈ ఘటనను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యేపై బురద జల్లేందుకు కొందరు నాయకులు ఎనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నాడన్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రామగుండంలో 108అడుగుల ఎత్తు గల ఆంజనేయస్వామి విగ్ర హం నిర్మిస్తున్నాడని, దీనికి సుమారు రూ.20కోట్లు వ్యయం అవుతుందని, తన సొంతగానే ఈ కార్యక్ర మాన్ని చేపట్టారన్నారు. బుగ్గ ప్రాంతంలో రాజీవ్ రహ దారిపై ప్రమా దాలు జరుగుతు న్నాయని బసంత్‌నగర్ ఫ్లై ఓవర్ సమీపంలో దారిమైసమ్మ ఆలయాన్ని సుమారు రూ.1కోటితో నిర్మి స్తున్నారన్నారు. గోదావరిఖని కోదండ రామాలయం గాలిగోపురం, మెయిన్ చౌరస్తాలోని పోచమ్మ దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. నాయకులు కొలిపాక సుజాత, ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, కొప్పుల శంకర్, దాసరి విజయ్, గడ్డం శ్రీనివాస్, సత్యనారాయణ, హమీద్, అఫిజ్ పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాలుగా
ఎన్టీపీసీ వెలుగులు
● ఘనంగా ఆవిర్భావ దినోత్సవం 7

ఖనిలో నిప్పంటించుకొని
వివాహిత ఆత్మహత్యాయత్నం
● ఆసుపత్రికి తరలించిన పోలీసులు, మెడికోలు 6

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇండియన్ బ్యాంకు ముందు నుంచి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో మండల కేంద్రానికి చెందిన మునిగంటి అజయ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా వ్యక్తిని కనుగొని శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన లారీ..

● క్లీనర్‌కు స్వల్ప గాయాలు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెట్టును లారీ ఢీకొట్టగా, క్లీనర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. పల్లీల లోడ్‌తో అహ్మదాబాద్ నుంచి వరంగల్‌వైపు లారీ వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల ఎదుట మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. దీంతో క్లీనర్‌కు స్వల్పగాయాలు కాగా, ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైతు నేస్తం..

శాస్త్రవేత్తలతో అనుసంధానం



రైతు నేస్తంలో పాల్గొన్న రైతులు

ఆధునిక సాగుపై అన్నదాతలకు అవగాహన

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం... రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానించే కార్యక్రమం. సాగులో ఆధునిక విధానాలు, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు చేరువవుతోంది. రెవెన్యూ గ్రామాల్లోని రైతు వేదికల్లో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులనుంచి రైతులు నేరుగా సలహాలను పొందవచ్చు. మండలంలోని చొప్పదండి, ఆర్నకొండ, గుమ్లాపూర్ రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతు వేదికల్లో మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు హాజరవుతున్నారు. రైతులకు ఒక రోజు ముందే సమాచారాన్ని అందిస్తారు. వీడియో కాన్ఫరెన్సులో అందుబాటులో ఉండే శాస్త్రవేత్తలు, పంటల సాగు, నూతన పంటలపై అవగాహన కల్పిస్తామని రైతులకు సమాచారాన్ని చేరవేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు వేదికల వద్దకు వెళ్లి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని పంటల తెగుళ్లు, ఎదుర్కొంటున్న వ్యాధుల గురించి శాస్త్ర వేత్తలతో మాట్లాడి పరిష్కారం పొందవచ్చు.

వ్యవసాయ అనుబంధ శాఖలు అందుబాటులోకి...



ప్రతి వారం నిర్వహించే కాన్ఫరెన్సులో వ్యవసాయంతోపాటు ఉద్యానవన, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, నీటి పారుదలశాఖకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు అందు బాటులో ఉంటారు. సాగులో అధిక దిగు బడులు పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు రైతులు పొందవచ్చు. నూతన సాగు విధానాలు, ఆధునిక పద్ధతులు, పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతుల కోసం వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకురాగా రైతు ముంగిటకు శాస్త్ర సాంకేతిక రంగాలు చేరాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి...
వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి



ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు రైతు వేదికలకు వచ్చి శాస్త్రవేత్తలు, అధికా రుల దృష్టికి సాగు సమస్యలు తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన పుల్లవేణి రాజశేఖర్(35) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లవేణి రాజశేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడసరైన ఉద్యోగం దొరక్కపోవడంతో సంవత్సరం క్రితం స్వగ్రామమైన అయిలాపూర్‌కు తిరిగివచ్చి చికెన్ బిర్యానీ సెంటర్ నడుపుతున్నాడు. అదిసరిగా నడవకపోవడంతో మద్యానికి బానిసై రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమయంలో గ్రామశివారులోని మల్లన్న గుట్ట సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. రైతులు పోలీసులతో పాటు బంధువులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌కు భార్య సంధ్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



సిద్ధార్థ(ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామశివారులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి పల్లికొండ సిద్ధార్థ (18) అనేయువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మామడ మండలం పోస్కల్ గ్రామానికిచెందిన సిద్ధార్థ ఈనెల6న చేపలు పట్టడానికి మూలరాంపూర్ గ్రామశివారులోని సదర్‌మట్ ప్రాజెక్టుగేట్ నెంబర్ 52 వద్దకు వెళ్లాడు. అక్కడ సిద్ధార్థ వలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ముందుకు పడి తలకు బలమైగాయమై నీటిలో పడి చనిపోయాడు. మృతుడు తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు బంగారు పుస్తెలు, ఒక బంగారు ముక్కుపోగు, 4 వెండిమట్టెలు అపహరించారు. గుడిలో పనిచేసే వంకాయల లక్ష్మీరాజం సాయంత్రం గుడికి వెళ్లి చూసేసరికి గుడికి వేసిన తాళం లేదు. లోపలకి వెళ్లి ఆభరణాలు కనిపించలేదు. ముదిరాజ్ సంఘం నాయకుడు తుమ్మల బాబు ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

● కాపాడి ఆసుపత్రికి తరలించిన పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు





స్వప్న(ఫైల్)

స్వప్నను ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ, పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన, ఆర్టీసీ డిపో వెనుక శుక్రవారం రాత్రి సల్ల స్వప్న(35) అనేవివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంటల్లో కాలుతున్న ఆమె ప్రాణభయంతో అరవడంతో అటుగా వెళుతున్న మెడికల్ విద్యార్థులు, యువకులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, వైద్యకళాశాల విద్యార్థులు చెట్ల పొదల్లో తీవ్రగాయాలతో పడిఉన్న స్వప్నను రక్షించి ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెపరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. ఆమె సూసైడ్ లెటర్ రాసి బ్యాగులో పెట్టుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదని, రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉన్నానని, ఏ పనిచేయలేకపోతున్నానని, అనారోగ్యంతో బాధపడుతున్నా నని, భయం భయంగా ఉందని, నామీద నాకు నమ్మకం లేదంటూ పేర్కొన్నది. ఫైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో సల్ల స్వప్న కుటుంబం నివాసముంటున్నారు. ఆమెభర్త సతీష్ దగ్గరలోని జూలపల్లి ఆదర్శనగర్‌లో కిరాణాషాపు నడుపుకుంటున్నాడు. ఇద్దరు పిల్లలు. మానసి కస్థితి సరిగా లేక రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. స్వప్నను రక్షించి ఆసుపత్రికి తరలించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, మెడికల్ కళాశాల విద్యార్థులను పలువురు అభినందించారు.

విషాహారం తిని 36 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లిలో విషాహారం తిని 36గొర్రెలు మృతిచెందగా 200 గొర్రెల వరకు అస్వస్థతకు గురయ్యాయి. పెర్కపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల కాపరులు బుధవారం గ్రామంలో కోసిన పంట పొలాల్లో గొర్రెలు మేసేందుకు వెళ్లారు. మందలో రెండు వందలకు పైగా గొర్రెలు ఉండగా కొన్ని సాయంత్రం వరకు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో కాపరులు సొంత వైద్యంతో పాటు వెటర్నరీ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వాడినట్లు సమాచారం. అప్పటికే మందలోని కొన్ని గొర్రెలు తీవ్రఅస్వస్థతకు గురై గురువారం సాయంత్రం మరణించగా, శుక్రవారం ఉదయం మరికొన్ని మరణించాయి. దీంతో ఆందోళనకు గురైన యాదవులు మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మంత్రి జిల్లా పశువైద్యాధికారి విజయ్ భాస్కర్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గ్రామానికి చేరుకొని చనిపోయిన 36 గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రెండు వందల గొర్రెలకు చికిత్స అందించారు. పోస్టుమార్టంలో కొన్నిగొర్రెలు వడ్లు తిని చనిపోగా మరికొన్ని విషాహారాన్ని తిని మృతిచెందినట్లు పశువైద్య అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నమూనాలను కరీంనగర్‌కు పంపగా అక్కడి నుంచి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. వారంలో రిపోర్టులు వస్తాయని అప్పటివరకు మృతికి గల కారణాలు స్పష్టంగా చెప్పలేమని మండల వైద్యాధికారి అజయ్ తెలిపారు.

మంత్రి ఆదేశాలతో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు సోగాల తిరుపతి, బుట్టి సాగర్, ఓరెం చిరంజీవి యాదవ సంఘం అధ్యక్షుడు అప్పాల శ్రీను మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు.

సేల్‌డీడ్‌కు రిజిస్ట్రార్ నిరాకరణ

● ఆందోళన వ్యక్తం చేసిన దంపతులు



నిరాకరించిన డాక్యుమెంటుతో తోట శ్రీకాంత్ దంపతులు

గంగాధర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే అపార్ట్‌మెంటులో బ్యాంకు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి అదే అపార్టుమెంటులో మరొకటి సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిని నిరాకరిస్తూ, చేయరాదంటూ రిజిస్ట్రార్ వెనక్కిపంపించారు. కరీంనగర్ పట్టణ కేంద్రం మారుతీ నగర్‌కు చెందిన తోట శ్రీకాంత్ రేకుర్తి గ్రామంలోని సర్వే నంబరు 80, లేపాక్షి పరివార్ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్‌నెంబరు 304కొనుగోలు చేశాడు. అక్టోబరు 18న సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ కోసం గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు సమర్పించాడు. అయితే శ్రీకాంత్ డాక్యుమెంటును ఈనెల4న డీటీఈపీ నిబంధనలు, జిల్లాకలెక్టర్ చింతకుంట గ్రామానికి సంబంధించిన ఉత్తర్వులను కారణం చూపుతూ నిరాకరించారు. కానీ అదేసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంతకు ముందు అదే అపార్ట్‌మెంటు, అదేసర్వే నంబర్ సంబంధించిన మార్టిగేజ్(బ్యాంకు టైటిల్ డీడ్ డిపాజిట్) లావాదేవీలను రిజిస్టర్ చేశారని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఆస్తిపై ఎటువంటి నిషేధ ఉత్తర్వులు లేవని, చట్టబద్ధమైన బదిలీని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు నిజంగా నిషేధిస్తున్నాయంటే అదేఆస్తికి బ్యాంకు మార్టిగేజ్ ఎలా అంగీకరించబడింది, సేల్‌డీడ్‌కు నిరాకరిస్తూ మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లను అనుమతించడం ఎలా సాధ్యమని శ్రీకాంత్ పేర్కొన్నారు. రేకుర్తి గ్రామంలోని లేపాక్షి పరివార్ ఎటువంటి నిషేధి జాబితాలో లేదని అటువంటి పరిస్థితిలో తన ప్లాటును నిరాకరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ చట్టపరమైన నిషేద ఉత్తర్వులు లేకుండా రిజిస్ట్రేషన్లను నిరాకరించడం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్71,72లకు వ్యతిరేకమని ఆయన అన్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ వద్ద అప్పీల్‌కు దాఖలు చేస్తామని తెలిపారు.

రుణం చెల్లించాలని ఇంటికి తాళం

● రోడ్డున పడ్డ వృద్ధ దంపతులు



రోదిస్తున్న వృద్ధ దంపతులు

వేములవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై తీసుకున్న రుణం తాలూకు బకాయిలు చెల్లించడం లేదని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వారు ఇంటికి తాళం వేయడంతో ఆ ఇంటినే నమ్ముకుని జీవిస్తున్న వృద్ధ దంపతులు రోడ్డున పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లారం గ్రామానికి చెందిన మల్లారం రాజయ్య, పోశవ్వకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన మల్లారం శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఇంటిని తాకట్టు పెట్టి రూ.14లక్షల రుణం తీసుకున్నాడు. సంవత్సరకాలంగా ఎలాంటి వాయిదాలు చెల్లించలేదు. తీసుకున్న బకాయిలు చెల్లించాలని సంస్థ వారు పంపిన నోటీసులకు సమాధానం లేకపోవడంతో సదరు సంస్థ వారు కోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం ఇంటి సామాను బయటవేసి ఇంటికి తాళంవేశారు. తాము నివాసముం టున్న ఇంటికి తాళం వేయడంతో దిక్కుతోచని స్థితిలోఉన్న రాజయ్య పోశవ్వలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. చిన్నకుమారుడు శ్రీనివాస్ ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో ఇంటిపరిసరప్రాంతాలలో తలదాచుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న రాజయ్య పోశవ్వ దంపతుల పరిస్థితి స్థానికులను కలిచివేస్తోంది.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, లక్ష్మీపూర్, లింగన్నపేట, ముచ్చర్ల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా లింగాపూర్ తండాలో బైండోవర్ ఉల్లంఘన కింద ఒకరికి జరిమానా విధించినట్టు వెల్లడించారు.

పొలంలో కొండచిలువ

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో పొలంలో కొండచిలువ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్‌లో ఓ రైతు తనపొలంలో హార్వెస్టర్‌తో వరికోయిస్తున్నాడు. ఈక్రమంలో కొండచిలువ హార్వెస్టర్ బ్లేడుకు తగిలి డ్రైవర్‌కు కనిపించింది. డ్రైవర్, సమీప రైతులు పొలం నుంచి కొండచిలువను బయటకు తీసుకువచ్చేసరికి మృతిచెందినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెన్నంపల్లి విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సైదాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ 2025లో రాష్ట్రస్థాయిలో ప్రథమబహుమతి పొంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోద్యాయుడు రాయి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డోలువాయిద్యం పోటీలలో అమరగొండ రోహిత, అమరగొండ అశ్వర్ద్, వెంగల ఆశీష్‌వర్ధన్ చిగుర్ల రిత్విక్‌లు హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యార న్నారు. ఎంపికైన విద్యార్థులకు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీడీ జ్యోతికి ప్రధానోపాధ్యాయుడు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుభా కాంక్షలు తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కరెంటు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. ధాన్యం లోడుతో బయలుదేరిన లారీ కరెంటు తీగలు అడ్డుగా ఉండడంతో గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపించాడు. దాంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రేకుర్తిగ్రామానికి చెందిన కోట పొచయ్య, బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన నల్లగొండ రాకేష్ రేషన్ కార్డుదారుల వద్ద నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 4క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సమీపంలోని ముస్కుపల్లి వాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి పట్టుకొని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో రౌడీషీటర్లు ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా నేరాలను ప్రోత్సహించినా, గొడవలు, దాడులు, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్టు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్..

మంథని: పోలీసు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై నిఘా ఉందన్నారు. ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎస్ఐ రమేష్ ఉన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు బాల్య వివాహాలను సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం మండలంలోని ఓ గ్రామంలో రెండు వేర్వేరుచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయనే సమాచారంతో జిల్లా కేంద్రానికి చెందిన అధికారులు పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకచోట పెళ్లికి సిద్ధంగా ఉన్న జంట పారిపోయారు. మరోచోట అధికారులు వెళ్లేసరికే పెళ్లి జరిగిపోయింది. అయితే పెళ్లిజరిగిన జంటకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విచారణ జరుపుతున్నారు. పారిపోయిన జంటను శనివారం తమ ఎదుట హాజరు పరచాలని ఇరువురి తల్లిదండ్రులను ఆదేశించారు.

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి



కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేముల వాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తజనసందడి నెలకొంది. శుక్రవారం వేలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో భక్తులు స్వామివారిని లఘుదర్శనం చేసుకున్నారు. శ్రీభీమేశ్వరాలయంలో కోడెమొక్కులు చెల్లించి అర్జిత సేవలైన కళ్యాణం, సత్య నారాయణ వ్రతం, కుంకుమపూజలు, అభిషేకాలు, అన్న పూజలు, మహాలింగార్చనలు, పల్లకి సేవలు, ఆకుల పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీకదీపోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి సుహాసినిలచే కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి

● యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
● విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
● 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్సలర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
● 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు... 161 మందికి బంగారు పతకాలు


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్


ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కరీంనగర్ టౌన్/గణేష్‌నగర్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందు కెళ్లాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయ పథం దిశగా తీసుకెళుతుందన్నారు. విద్యార్థుల మేథాశక్తే వారి ప్రయోగశాల అని అభివర్ణించారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతోందని, బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కావద్దని అన్నారు. డిజిటల్ లర్నింగ్, భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని చెప్పారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసాలు విద్యార్థి విజయానికి దోహద పడతాయని తెలిపారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని గవర్నర్ అన్నారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతి విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

'శాతవాహన' ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రొఫెసర్ బీజే రావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ



ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు. రెండు దశాబ్దాల కంటే తక్కువ వ్యవధిలో ఈ సంస్థ తెలంగాణాలోని ఉత్తర ప్రాంతంలో అభ్యాసానికి, ఉన్నత విద్యకు కీలకమైన కేంద్రంగా మారిందని అన్నారు. ఆరు సంవత్సరాల్లో విశ్వ విద్యాలయంలో 1,03,454 మంది అండర్ గ్రాడ్యుయేట్లలో 55,000 మందికి పైగా విద్యార్థులు పట్ట భద్రులయ్యారని, 34,561 మందిలో 25,310 మంది పీజీ డిగ్రీలను సొంతం చేసుకున్నారన్నారు.

కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నాం

ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్, 'శాతవాహన' వీసీ



శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 156 కళాశాలలు యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. ఎం ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీటెక్ కోర్సులు ప్రారంభించామని చెప్పారు. వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత బయోమెట్రిక్ హాజరు అమలు చేశామని, విద్యార్థుల భద్రత కోసం 100 కెమెరాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, కలెక్టర్ పమేలా సత్పతి, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను, 2018 నుంచి 2023 వరకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ అందజేశారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం... పోలీసు గౌరవ వందనం

కరీంనగర్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు రావలసిన గవర్నర్ 15 నిమిషాల ముందే యూనివర్సిటీకి చేరుకున్నారు. పరిపాలన విభాగం భవనం ముందు పోలీసులు ఆయనకు గౌరవవందనం సమర్పించగా, వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.



హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అధికారులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యం..: నర్మద



నేను అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదివాను. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాను. నన్ను ప్రోత్సహించిన తెలుగు హెచ్‌వోడీ లక్ష్మీనారాయణ సార్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు. నాలుగు బంగారు పతకాలు అందుకోవడం సంతోషాన్నిచ్చింది.

ఇదే స్ఫూర్తితో ముందుకుసాగుతా..: అమరనంద



మాది ధర్మారం రాజారాంపల్లి. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందాన్నిచ్చింది. ఈ గోల్డ్ మెడల్స్ సాధించడానికి ప్రోత్సాహం ఇచ్చిన తెలుగు డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణకు రుణపడి ఉంటాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కొనసాగిస్తాను.

అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతో.. కామినేని సాయిచరిత్ర



నేను వివేకానంద డిగ్రీ, పీజీ, కళాశాలలో ఎంబీఏ హెచ్ఆర్ చదువుకున్న. రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. మా అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

నా కష్టానికి ఫలితం దక్కింది..: వసీమా



నేను ఎంబీఏ ఫైనాన్స్ చదువుకున్న. నాకు చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదవడం అలవాటు. అలా చదవడం వల్ల ఈ రోజు బంగారు పతకం సాధించా. చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ఫలితం దక్కింది.

రెండు బంగారు పతకాలు సాధించాను: బూర నవీన్



మాది వేములవాడ మండలం మారుపాక. ఎంఏ సోషియాలజీ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాను. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

సంతోషంగా ఉంది.. కాల్వ వెంకటేశ్



ఎంబీఏ మార్కెటింగ్ 2017-19 సంవత్సరంలో చదువుకున్నా. నేను పేద కుటుంబం నుంచి వచ్చాను. రూరల్ బ్యాక్ గ్రౌండ్ అయినా కష్టపడి చదివి నేను అనుకున్నది సాధించాను. దీనికి మా తల్లిదండ్రులు, అధ్యాపకులే ప్రధాన కారకులు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉంది.

తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు: కొండ ప్రవళిక



మాది రాయికల్ మండలం మూటపల్లి గ్రామం. శాతవాహన యూనివర్సిటీలో 2019లో ఎంఏ తెలుగు పూర్తి చేశాను. ప్రాచీన సాహిత్యంలో నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఇందుకు సహకరించిన గురువులకి, తల్లిదండ్రులకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రోత్సాహాన్నిచ్చింది.. తౌటం సునిల్



రంగాపూర్ గ్రామానికి చెందిన నేను అర్థశాస్త్రంలో బంగారు పతకం సాధించాను. పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. నా భవిష్యత్తుకు ప్రోత్సాహాన్నిచ్చింది.

అమ్మ నాన్నల చేతుల మీదుగా అందుకుంటే బాగుండేది..: మోడెం క్రాంతికుమార్



ఖమ్మం జిల్లాకి చెందిన నేను ఎంఏ సోషియాలజీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాను. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. అమ్మనాన్నల చేతుల మీదుగా అందుకుంటే మరింత సంతోషంగా ఉండేది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..: స్పందన



కెమిస్ట్రీ విభాగంలో నాకు బంగారు పతకం రావడానికి మా తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడింది. వారికి, శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రస్తుతం టీచింగ్ ఫీల్డ్‌లో ఉన్నాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత విజయాలు సాధిస్తా.

గొప్ప అనుభూతి.. డాక్టర్ జమున, పీహెచ్‌డీ స్కాలర్



నేను జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది నాకు గొప్ప అనుభూతి. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.. డాక్టర్ ఫాతిమా సుల్తానా, పీహెచ్‌డీ స్కాలర్



నేను మానకొండూరు మండలం పోచంపల్లి మోడల్ స్కూల్లో పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.

యూనివర్సిటీకి కృతజ్ఞతలు డాక్టర్ ఎన్ మాల్లారెడ్డి, పీహెచ్‌డీ స్కాలర్



పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది. 2023లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసినందుకు నాకు ఈ రోజు పట్టా ఇచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

తోటి గిరిజన తెగపై పరిశోధన చేశా.. డాక్టర్ మరక శ్రీనివాస్, పీహెచ్‌డీ స్కాలర్



గిరిజన తెగల్లో అతి తక్కువ జనాభా ఉన్న తోటి గిరిజన తెగపైన పరిశోధన చేశా.. గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పరిశోధనకు సహకరించిన గురువు వన్నాల రమేష్‌కు, కుటుంబ సభ్యులందరికి కృతజ్ఞతలు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి ఆటల పోటీలు


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో 11వ జోనల్‌స్థాయి ఆటల పోటీలలో భాగంగా శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో క్యారమ్ డబుల్స్‌లో మానకొండూర్ ప్రథమ, దుబ్బాక ద్వితీయ, చెస్‌లో దుబ్బాక ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-17 విభాగంలో కబడ్డీలో కోహెడ ప్రథమ, చేర్యాల ద్వితీయ, క్యారమ్ డబుల్స్‌లో హుస్నాబాద్ ప్రథమ, ముస్తాబాద్ ద్వితీయ, చెస్‌లో ముస్తాబాద్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-19విభాగంలో ఖోఖోలో మానకొండూర్ ప్రథమ, కోహెడ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో మానకొండూర్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయ, చెస్‌లో కోహెడ ప్రథమ, అల్వాల్ ద్వితీయ స్థానాలు సాధించాయి.

వైభవంగా గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న వేదపండితులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, హరినామ సంకీర్తనలతో గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుధగోని లహరి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం సిరిసిల్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో లహరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాటాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి చదువుతో పాటు ఆటల్లో రాణిస్తోందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు ఖమ్మం జిల్లా పినపాక మండలం బయ్యారంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు నుంచి లహరి పాల్గొంటుందని తెలిపారు.


లహరికి మెమోంటోను అందిస్తున్న హెచ్‌ఎం శారద

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి వంకాయల నందన్‌సాయి ఎంపికయా డు. విద్యార్థి వంకాయల నందన్ సాయిని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఆర్చరీ కోచ్ మహేందర్, హరీష్, భారతి విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ రామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణాకర్ శుక్రవారం అభినందించారు.

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వంకాయల నందన్‌సాయి ఇండియన్ రౌండ్‌లో ప్రథమస్థానంలో నిలిచి ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో జరిగే పోటీల్లో నందన్‌సాయి ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొననున్నారు.


నందన్ సాయి

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం శుక్రవారం తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 3,282 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా, రెండు గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 254 క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

అట్టహాసంగా జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

- హాజరైన సినీ హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ హీరో, కరాటే లెజెండ్ డాక్టర్ సుమన్ తల్వార్ ప్రారంభించారు. కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడమీ చీఫ్ ఇ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 1200 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ కరాటే ప్రపంచంలోనే నంబరువన్ క్రీడగా అవతరించిందని, ఎక్కువ దేశాల్లో కరాటేకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతన్నారు.

ఈరోజుల్లో అమ్మాయిల మీద జరుగుతున్న సంఘటనలు తనను చాలా బా ధించాయని, కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. మలేషియా గ్రాండ్ మాస్టర్ అనంతన్, టోర్నమెంట్ చీఫ్ అడ్వయిజర్ రవీందర్ కుమార్, వసంత్ కమార్, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఐలయ్య, మొండయ్య, మన్నన్, ఆర్గనైజర్ మాడుగుల ప్రవీణ్, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ హీరో సుమన్, పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఐదు దశాబ్దాలుగా ఎన్టీపీసీ వెలుగులు

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత - ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తోందన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తోందన్నారు. ఎన్టీపీసీ సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయా లని ఆయన కోరారు. విద్యుత్పత్తితోపాటు సామాజిక అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి చేస్తోందన్నారు. ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియం, ఈడీ రెసిడెన్షియల్ ఏరియాలో మాస్ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన్‌కుమార్ ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈడీ కేక్ కట్ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

ప్రజల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం


గీతాలాపనలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం వందేమాతరం స్మారక నాణాన్ని విడుదల చేస్తున్నదన్నారు. కలెక్టరేట్ పాలనాధికారి శ్రీనివాస్, సీ సెక్షన్ పర్యవేక్షులు ప్రకాష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్, కమిషనర్ అరుణశ్రీ అధికారులు, సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఈఈ రామన్‌లు పాల్గొన్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఎంఈఓ నరేంద్ర చారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గండ్ర దేవేందర్ రావులు ప్రసంగించారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో వందేమాతరం గీతాలాపన చేశారు. సింగిల్ విండో ఛైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, తహసిల్దార్ జగదీశ్వర్ రావు, డిప్యూటీ తహసిల్దార్ గర్రెపల్లి శంకర్, ఎంపీడీఓ రాంమోహన్‌చారి, ఎస్ఐ వెంకటేష్, డాక్టర్లు, సీఈఓ శ్రీనివాస్, ఎంఈఓ మహేష్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సామూహిక వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఛైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వందేమాతరం గీతం ఆలపించారు. బీజేపీ నేతలు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరు సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కొలనూర్ తోపాటు పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ప్రతి పౌరునికి ఒక ప్రేరణ కలిగించే గీతమని ప్రధానోపాధ్యాయులు అన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలు, మండల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వందేమాతరం గీతంను ఆలపించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు వందేమాతరం గీతాలాపాన చేశారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కేంద్రబొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా శుక్రవారం వందేమాతరం రచించి 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతరం గీతాలపన చేశారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, అధికారుల పాల్గొన్నారు.

వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జేఎన్టీయూ కళాశాలలో వందేమాతరం గీతాలపన చేశారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్ళు సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో సామూహిక గీతాలాపన జరిగింది. జీఎం బండి వెంకటయ్య ఉద్యోగులతో కలసి వందేమాతారాన్ని ఆలపించారు. ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజనీర్ సుజన్ మెహ్రా, అరవిందరావు, పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ బ్యారెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, అధికారులు, జవాన్లు పాల్గొని గీతాలాపాన చేశారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రజలు వందేమాతర గీతాలాపనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల కాడె సూర్యనారాయణ, మెడవేని తిరుపతి, బీజేపి నాయకులు దేవి రాజలింగయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ అదికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వందేమాతరం గీతాన్ని ప్రజలు, విద్యార్థులతో కలిసి ఆలపించారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపిడిఓ పద్మజ, ఎంపిఓ శేషయ్య సూరి, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని,(ఆంధ్రజ్యోతి): వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వందేమాతరం గీతాలపన చేశారు.

చిన్ననీటి వనరుల సర్వేకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1090 చెరువులు, కుంటలు ఉన్నాయి. 24,172 వ్యవసాయ బోర్‌వెల్స్, 43,049 వ్యవసాయ బావులు ఉన్నాయి. వీటి ద్వారా 1,51,854 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు కబ్జాకు గురై కనుమరుగయ్యాయి. కాగితాల్లో ఉన్న లెక్కల ప్రకారం క్షేత్రస్థాయిలో నీటి వనరులు కనబడడం లేదు. ఈ సర్వే ద్వారా జిల్లాలో సజీవంగా ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయో తెలియనున్నది. ఈసారి సర్వే వివరాలను యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో పక్కాగా జరగనున్నది. సర్వే ద్వారా వెల్లడయ్యే వివరాల ప్రకారం చిన్ననీటి వనరులను కాపాడుకు నేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించనున్నది. ఈ సర్వే ఒక్క కేంద్ర ప్రభుత్వానికే గాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉపయోగపడనున్నది. 2017-18లో నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో 36,378 వ్యవ సాయ బావులు, 1184 గొట్టం బావులు, 2,931 మధ్య తరహా, 2385 ఇతర గొట్టం బావులు ఉన్నాయి. ఉపరితల నీటి వనరుల పథకాలు 1402, ఎత్తిపోతల పథకాలు 261 ఉన్నాయని సీపీవో గంప రవీందర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

45 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు గ్రౌండింగ్ చేయకుంటే రద్దు

పెద్దపల్లి, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన 45 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ చేయకుంటే రద్దు చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గానికి మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. ఇప్పటి వరకు ఇళ్లు ఆరంభించని లబ్ధిదారులతో మాట్లాడి ఆరంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారుల నుంచి రాతపూర్వకంగా ఆసక్తి లేదని పత్రాలు తీసుకోవాలని సూచించారు. ఆర్థికంగా లేని లబ్ధిదారులకు స్వశక్తి సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి బిల్లులు వేగంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్ రావు, డీపీఓ వీరబుచ్చయ్య, ఎంపీడీఓలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం

కమాన్‌పూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైనాల రాజు, సింగిల్ విండో ఛైర్మన్ ఇనగంటి భాస్కరరావు అన్నారు. శుక్రవారం జూలపల్లి, నాగారం, రొంపికుంట, గొల్లపల్లి, గుండారం గ్రామాల్లో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రైతులకు సహకారాలు అందిస్తామన్నారు. పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ చిందం తిరుపతి, గుండారం మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతోపాటు ఓడేడు, అడవిశ్రీరాంపూర్, జిల్లెపల్లి, సీతంపేట, ఇప్పలపల్లి, లక్కారం, పోతారం, సర్వారం, పారుపల్లి, దరియాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్మన్ అల్లాడి యాదగిరి రావు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మద్దెల రాజయ్య ప్రారంభించారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రమారెడ్డి, డైరెక్టర్లు గుజ్జ గోపాల్ రావు, గిరి వీరేందర్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ఆదివారంపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాక్స్‌ఛైర్మన్ యాదగిరిరావు, వైస్ ఛైర్మన్ కొమురయ్యలు ప్రారంభించారు.

గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకొన్న విద్యార్థులు


బంగారు పతకాలు అందుకున్న ఖని పీజీ విద్యార్థులు, సమ్రీన్, మానస

కోల్‌సిటీటౌన్, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవ వేడుకలో గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు బంగారు పతకాలు అందు కున్నారు. తెలంగాణ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్‌వర్మ, హెచ్‌సీయూ వీసీ సీజే రావు, శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థులు ఉషశ్రీ, కందూరి కళ్యాణి, సాగరిక, పున్నం కళ్యాణి, మునిగంటి మౌనికలు బంగారు పతకాలు అందుకున్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెం దిన సమ్రీన్ ఉర్దూ మీడయం ఎంఏలో 80 శాతం మార్కులు సాధించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నది. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె టాపర్‌గా నిలవడంతో గవర్నర్ ఆమెకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని అందించారు. గోల్డ్‌మెడల్ సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన స్కంద కాశీ మఠం జగదీశ్వర్ కుమార్తె మానస ఆర్గానిక్ కెమిస్ట్రీలో డాక్టరేట్ పట్టా లభించింది. కరీంనగర్ లో శుక్రవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. శాతవాహన యూనివర్సిటీలో మానస ఆర్గానిక్ కెమిస్ట్రీలో పరిశోధన నిర్వహించారు.

ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు


క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితో ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం జూనియర్ కళాశాల మైదానంలో సీనియర్ ఇంటర్ జిల్లా ఖోఖో చాంపియన్ షిప్ పోటీలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సీనియర్ ఇంటర్ ఖోఖో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే బృందాలకు, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఆర్డీఓ గంగయ్య, జిల్లా ఎన్జీఓ అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా యువజన క్రీడా అధికారి సురేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

హాకీ అసోసియేషన్ శతాబ్ది వేడుక

రామగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ హాకీ అసోసియేషన్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో శతాబ్ది ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వై.వీరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. హాకీ మ్యాచ్‌ను నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ముఖేష్, ఉపాధ్యక్షుడు సలీం, సభ్యులు కెఎల్ఎన్ ప్రసాద్, సదానందం, నరసింహారెడ్డి, శేషగిరి, నాగరాజు, అరిఫ్, చంద్రపాల్, రంజిత్, నికిల్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మండలంలోని మండల విద్యాశాఖ అధికారి తన పరిధిలోని పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీతో కలిసి విద్యా శాఖపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ సంబంధించి జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాల పురోగతి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల జిల్లా వెనుకబడి ఉందని కలెక్టర్ తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు రెగ్యులర్‌గా పాఠశాలలను విజిట్ చేస్తూ సదరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జడ్పీ సీఈఓ నరేందర్, డీఈఓ డి మాధవి, ఎంఈఓలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


వైద్యులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని మాతాశిశు కేంద్రంలో మెరుగైన వైద్యసేవలందించిన సిబ్బందిని సన్మానించి, జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అక్టోబరు నెలలో 240ప్రసవాలు నిర్వహించడం అభినందనీయమని, సూపరింటెండెంట్, వైద్యాధికారులను, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మర్యాదగా మెదలాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, అటెండర్ల వద్ద ఎవరైనా సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. దండె రాజు అధ్యక్షతన జరుగగా సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, డీఎంహెచ్ఓ వాణి, అరుణతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

జ్యోతినగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూం ఇండ్ల పెండింగ్ పనులు త్వరగా పర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం జంగాలపల్లిలోని డబుల్ బెడ్ ఇండ్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా ఏర్పాటు చేయాలన్నారు. పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ ఈఈ బావ్ సింగ్, మున్సిపల్ ఈఈ రామన్‌తోపాటు అధికారులు ఉన్నారు.



ఏఎల్‌పి పిట్ కమిటీ సెక్రటరీగా వీవీగౌడ్

రామగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిసంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పి పిట్‌కమిటీ సెక్రటరీగా వివిగౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన కమిటీలో అసిస్టెంట్ సెక్రటరీగా పూసాల శేఖర్, గొర్రె క్రాంతియాదవ్, కొప్పుల సురేష్, ఇంచార్జిలులుగా సతీష్, మేకల చిన్నయ్య, స్వరాజ్యం, సత్యనారయణ, సుమంత్, బ్రాంచ్ సెక్రటరీలుగా తిప్పారపు తేజకుమార్, మాదాచంద్రయ్య, సందీప్‌రెడ్డి కార్యవర్గం ఎన్నికయ్యారు.

డ్రాగ్‌లైన్ తరలింపు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 డ్రాగ్‌లైన్ సురక్షితంగా తరలించడంలో ఆర్జీ-2 ఏరియా ఇంజనీరింగ్ బృంద నైపుణ్యం ఉన్నట్టు జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. డ్రాగ్‌లైను తరలించడంలో కీలకంగా పని చేసిన శుక్రవారం ఈఅండ్ఎం(ఈఈ) రాధాకృష్ణను జీఎం సన్మానించారు. జీఎం మాట్లాడుతూ 31 ఏళ్ల పని చేసిన డ్రాగ్‌లైన్ యంత్రం 1,40,530 ఉత్పాదక గంటలు పనిచేసి 11.77 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించినట్టు తెలిపారు. మైనింగ్ బెంచ్ (ఆర్ఎల్ 720) నుండి ఆర్ఎల్ 840 వరకు సురక్షితంగా తరలించాల్సి ఉండగా, సవాళ్ళతో కూడిన పనిని అత్యంత నైపుణ్యం, సాంకేతిక ప్రణాళికలతో విజయవంతంగా పూర్తి చేయడంలో రాధాకృష్ణ కృషి ఉన్నట్టు జీఎం వెంకటయ్య తెలిపారు. డ్రాగ్‌లైన్ చరిత్రలో ఇది మైలురాయి గా అభిప్రాయపడ్డారు. ఎస్వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజ నీర్ సుజన్‌మెహర్, అరవిందరావు, రాంచందర్, ఉజ్వల్ బంధోపాధ్యాయ, రాజాజీ, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోని సంఘాలు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ పేరిట కార్మిక కుటుంబాలను యాజమాన్యం అవహేళన చేస్తున్నా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పందించకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజారెడ్డి అన్నారు. శుక్రవారం యూనియన్ ఆఫీస్‌లో జరిగిన బ్రాంచి కమిటీ సమావేశంలో మాట్లాడారు. గైర్హాజరు కార్మికులకు క్రమశిక్షణ పేరిట ఇటీవల యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్వాగతించడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. నెలలో అండర్ గ్రౌండ్ కార్మికులు 16 మస్టర్లు, సర్ఫేస్ కార్మికులు 20 మస్టర్లు చేయకపోతే వారి కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వడం సరికాదని అన్నారు. బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

11న డిపెండెంట్‌లకు ఉద్యోగ నియామక పత్రాలు

గోదావరిఖని, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్ ఫిట్ అయిన కార్మికుల డిపెండెంట్‌లకు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ నియామక ఉత్తర్వులు నవంబర్ 11న కొత్తగూడెంలో యాజమాన్యం జారీ చేసేందుకు అంగీకరించిందని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం వారు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ, డైరెక్టర్(పా)లను కలిగి కార్మికుల సమస్యలపై చర్చించగా పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. ఏడు నెలలుగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును ఈ నెలాఖరులోపు నిర్వహించేందుకు అంగీకరించారన్నారు. మెడికల్ ఫిట్ అయి పోస్టింగ్‌కు ఎదురు చూస్తున్న దాదాపు 473 మందికి ఈ నెల 11న కొత్తగూడెంలో ఆర్డర్స్ అందచేస్తారని తెలిపారు. సీఎండీ, డైరెక్టర్(పా)స్థాయి స్ట్రక్చరల్ కమిటీ సమావేశం ఈనెల 10న, జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం 11న నిర్వహించేందుకు అంగీకరించారనితెలిపారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

అంతర్గాం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, అంతర్గాం మండలంలోని కొన్ని గ్రామాల్లో శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణచందర్ ప్రకటనలో తెలిపారు. అంతర్గాంలోని ముర్మూరు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద సంపు పైప్‌లైన్ నిర్వహణ పనుల నిమిత్తం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ పీడీ రాజేశ్వర్

పాలకుర్తి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి):పాలకుర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించారు. ఇళ్లు మంజూరై కట్టుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించేందుకు గుత్తెదారు ముందుకొచ్చాడని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ పీడీ రాజేశ్వర్ సూచించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మక్కాన్‌సింగ్ సేవసమితి ఛైర్‌పర్సన్ మనాలి ఠాకూర్, ఎంపీడీవో పొల్సాని శశికళ, హౌసింగ్ డీఈ దస్తగిరి, కార్యదర్శులు, మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ ఎర్రం స్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, పాత రవింతర్, ఇందిరమ్మ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీఈఈయూ 1107 అసిస్టెంట్ సెక్రెటరీగా విశ్వనాథ్



పెద్దపల్లి కల్చరల్, నవంబర్ 7 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1107 ట్రాన్స్‌కో కంపెనీ కమిటీ అసిస్టెంట్ సెక్రెటరీగా దుర్గం విశ్వనాథ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, జి.సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు, తన నియామకానికి సహకరించిన ట్రాన్స్‌కో యూనియన్ ప్రెసిడెంట్ ఎం.తులసీ రామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సి.నాగరాజు, అనుబంధ కార్యదర్శి కె.రామచంద్రం, సెక్రెటరీ ఎన్. బాలకృష్ణకు విశ్వనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని, ఆర్టిజన్ కార్మికుల ఏపీఎస్ఈబీ రూల్స్, కన్వర్షన్‌పై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

కమాన్‌పూర్ ఎంపీవో బాధ్యతల స్వీకరణ

కమాన్‌పూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండల పంచాయతీ అధికారిగా సౌమ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన కాటం భాస్కర్ నర్సంపేటకు బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జిగా మారుతిని ఎంపీవోగా నియమించారు. గ్రూప్ 2లో ఉత్తీర్ణత సాధించిన సౌమ్యకు ఇక్కడ పూర్తి స్థాయిలో ఎంపీవోగా పోస్టింగ్ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

కాల్వశ్రీరాంపూర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మల్యాలలో శుక్రవారం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి స్ఫూర్తితో సుమారు 200 మందికి కంటి పరీక్షలు చేశారు. 35 మందికి కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేయనున్నట్లు ఫౌండేషన్ బాధ్యులు తెలిపారు. ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్రకుమార్, మండల ఇన్‌చార్జి కల్లపల్లి సాగర్, కొంకటి లచ్చయ్య, ఉప్పుల శ్రీనివాస్, ఉప్పుల దేవేందర్, రాంబాబు, రామ్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

జ్యోతినగర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఈ నెల 15న నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 4వ మహాసభల పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూడేళ్లుగా కార్మికులు, ఉద్యోగాల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసి విజయాలు సాధించామన్నారు. మహాసభలను ఆయా వర్గాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భిక్షపతి, రామచారి, గీట్ల లక్ష్మారెడ్డి, మల్లేష్, గుండు కనకయ్య, ముత్తునూరి సంపత్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

10న ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

అంతర్గాం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): రామగుండంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 10న అప్రెంటీస్‌షిప్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఈసారపు సురేందర్ తెలిపారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, టీసీ, ఆధార్ కార్డు జిరాక్స్‌తో రామగుండం ఐటీఐలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్ విద్యాసాగర్ రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

ఎన్టీపీసీ వేడుకల్లో విశ్రాంత ఉద్యోగులు

జ్యోతినగర్, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ వేడుకల్లో విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం శుక్రవారం బీఆర్ అంబేద్కర్ భవన్ వికాస కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి జ్ఞాపకాలను పంచుకున్నారు. రేవా అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుర్గం నర్సయ్య, డీఎన్ పోచయ్య, లాలయ్య, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్‌తో జాతీయ గణాంకాల అధికారి భేటీ

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ గణాంక కార్యాలయ అధికారి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం రామగుండం నగర కమిషనర్ అరుణశ్రీతో సమావేశమయ్యారు. రామగుండంలో జరుగుతున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేపై వివరించారు. వేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థ, త్వరితగతిన జరుగుతున్న సాంకేతిక అభివృద్ధి కారణంగా విధానాల రూపకల్పనలో స్వల్ప అంతరాలలో శ్రామిక గణాంకాలు అవసరమని ప్రభుత్వాలు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్వేకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామగుండం ఎంపికైందని, నగరంలో సర్వే ప్రారంభించామన్నారు. తొలుత సాధారణ వివరాలు సేకరించి అనంతరం ప్రత్యేక ట్యాబ్ ద్వారా 12 శ్రామిక కుటుంబాలను ఎంపిక చేసి వారి వివరాలు నమోదు చేస్తామన్నారు.

వార్డు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వార్డు అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరించాలని నగర కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం వార్డు అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పని చేయాలన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి లైట్లు తదితర సమస్యలను దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఆయా విభాగాల సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, వారు స్పందించకుంటే అధికారులకు నివేదిక ఇవ్వాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా జరిగే అభివృద్ధి పనులు, పట్టణ ప్రణాళిక విభాగం చేపట్టే ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షించాలన్నారు. తమ పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పారిశుధ్య నిర్వహణ, మధ్యాహ్నభోజన నాణ్యతపై ఆకస్మిక తనిఖీ జరుపాలన్నారు. ఈఈ రామన్, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆర్ఓ ఆంజనేయులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.